క్లుప్తంగా

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

యాదమరి: మండల కేంద్రంలో నేడు బుధవారం మధ్యాహ్నం వైఎస్సార్ ఆసరా పథకం కింద చెక్కులు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ శివరాజ్, ఏపీఓ కల్పలతా రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంటకు యాదమరి శివపార్వతీ కల్యాణ మండపంలో చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. డ్వాక్రా మహిళలు అందరు తప్పక హాజరు కావాలని కోరారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

ఐరాల: మండలంలోని డ్వాక్రా సంఘ మహిళలకు నేడు బుధవారం వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేయనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు మహిళా సంఘ సభ్యులకు చెక్కును అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, డ్వాక్రా మహిళలు తప్పక హాజరు కావాలని కోరారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 9 గంటలకు డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా చెక్కును పంపిణీ చేస్తారని తవణంపల్లె ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, ఏపీఎం రవి తెలిపారు. కార్యక్రమానికి పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమానికి డ్వాక్రా సంఘ సభ్యులు తప్పక పాల్గొనాలని కోరారు.

నేడు జగ్జీవన్‌రామ్ జయంతి

బంగారుపాళెం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరిప్రసాద్ తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్న కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

వేణుగోపాలస్వామి అలంకరణలో శ్రీరామచంద్రుడు



వేణుగోపాలస్వామి అలంకరణలో శ్రీరామచంద్రుడు

చిత్తూరు రూరల్: నగరంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో మంగళవారమూ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా సాగాయి. వేదపండితులు వేకువజామునే అభిషేకపూజలు చేశారు. అనంతరం స్వామివారు వేణుగోపాలస్వామి అలంకరణలో భక్తులను కనువిందుచేశారు. ఈ సందర్భంగా భక్తులు శ్రీరామ భజన, గీతాలాపన చేశారు. రాత్రి గజవాహనంలో స్వామి విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయ చైర్మన్ వెంకటేష్‌గుప్తా, అర్చకులు వేణుగోపాలస్వామి, సభ్యులు రాజా, ఈఓ సుబ్రమణ్యం నాయుడు పాల్గొన్నారు.

పింఛన్ల అందజేత



ఫింఛన్ అందజేస్తున్న వలంటీర్

పూతలపట్టు: మండలంలో మంగళవారం వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఆకనంబట్టు చెందిన వలంటీర్ కీర్తి గ్రామంలో మంగళవారం వేకువజామునే పింఛన్ అందజేశారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రథోత్సవాన్ని విజయవంతం చేయండి

చిత్తూరు రూరల్: స్థానిక కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే రథోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ చైర్మన్ సకల వెంకటేష్‌గుప్తా పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొన్నేళ్ల తర్వాత ఆలయానికి నూతనంగా రథాన్ని తయారు చేయించామన్నారు. రూ. 25 లక్షలతో నిర్మించిన ఈ రథం బుధవారం జరిగే రథోత్సవంలో నగర వీధుల్లో తిరుగుతుందని తెలిపారు. పెద్దసంఖ్యలో భక్తులందరూ విచ్చేసి రథోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. అర్చకులు వేణుగోపాల్, సభ్యులు రాజా, ఈఓ సుబ్రమణ్యంనాయుడు పాల్గొన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

వెదురుకుప్పం: రాజీ పేరుతో పిలిచి నాగరాజును అతి కిరాతకంగా చంపిన హంతకులను కఠినంగా శిక్షించాలని వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురగయ్య డిమాండ్ చేశారు. మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఎస్.నాగరాజు(35)ను శనివారం రాత్రి కురవ కనుమ వద్ద హత్య చేసి తగలబెట్టిన ఉదంతం తెలిసిందే. విషయం తెలుసుకున్న వడ్డెర సంఘం నాయకుడు మురగయ్య మంగళవారం బ్రాహ్మణపల్లె గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబానికి రక్షణ, న్యాయం జరగకపోతే ఆందోళనకు దిగుతామని తెలిపారు.

మీరు చల్లం'కుండ'!

- దప్పికకు దివ్య ఔషధం కుండ నీరు
- పేదవాడి ఫ్రిజ్‌కి పెరుగుతున్న డిమాండ్



అమ్మకానికి సిద్ధంగా కుండలు

గుడిపాల: అసలే వేసవి. ఉష్ణపాతం. ఎన్ని నీళ్ల తాగినా తీరని దప్పిక. రిఫ్రిజిరేటర్లు ఉన్నా అలంకారప్రాయమే. ఈ పరిస్థితిల్లో ప్రజలముందు ఉన్న ఏకైక ప్రత్యామ్నాయం మట్టికుండ. దాహం తీరా లంటే ఇందులో నీటినే తాగాలి అన్నంతాలా గ్రామీణులు జీవితాల్లో అన్నట్లుంటుంది మట్టికుండ.

పేదవాడి ఫ్రిజ్‌గా పేరొందిన మట్టికుండలకు రోజురోజుకి డిమాండ్ పెరుగుతుంది. వేసవి తాపం తీర్చేది చల్లటి నీరే. సామాన్యులకు చల్లటి నీటిని మట్టికుండలు తప్ప వేరేవి అందించలేని పరిస్థితి. ఆర్థికంగా స్థిరపడిన వారు కొనుగోలు చేస్తున్నారు. మట్టికుండల్లోని నీటిని తాగితే ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలే లేవని వైద్యులు కూడా చెబుతున్నారు. కొద్దిరోజులుగా భానుడు విశ్వరూపం చూపుతుండడంతో మట్టికుండల కొనుగోల్లు మండలంలో ఊపందుకున్నాయి.

గుడిపాలలో కుండలు అందుబాటులో...

గుడిపాల మండలంలోని వసంతాపురం గ్రామంలో కుమ్మరి కులస్థులు అధికంగా ఉన్నారు. ఇక్కడ నుంచి చిత్తూరుకు అధిక సంఖ్యలో కుండలు వ్యాపారులు తీసుకెళ్తుంటారు. ఇక్కడ అన్నిరకాలు కుండలు అందుబాటులో ఉంటాయి. ముఖ్యంగా ఆకుకూరలు వండేందుకు రాళ్లసట్టులు, పుష్పతొట్టెలు, పశువులు నీరు తాగే తొట్టెలు, కుండలు, వంటచేసే పొయ్యేలు, దీపావళి పండుగ సమయంలో ఇంటిముందు పెట్టే దీపాలు సహా అనేక రకాలను తయారుచేస్తుంటారు. ఇక్కడ కుండలకు మంచి గిరాకీ ఉంది.ముందుగానే చిత్తూరు నుంచి వ్యాపారస్థులు వచ్చి కుండలను తీసుకెళ్తుంటారు.



మట్టికుండను తయారుచేస్తున్న కుమ్మరి,



దేవుడు బొమ్మలకు రంగులు పూస్తున్న కుమ్మరి

గ్రామీణ ప్రాంతాల్లో కుండలకు మాత్రం మంచి గిరాకీ ఉంది.

కుమ్మర్లు తక్కువ..వ్యాపారులు ఎక్కువ...

కుండలు తయారుచేసే కుమ్మర్లకు మాత్రం ఒక్కో కుండ 60 రూపాయలకు తీసుకుని వ్యాపారులు మాత్రం వాటిని 120 రూపాయలకు పైగా విక్రయిస్తున్నారు. అలాగే అన్ని వస్తువుల కొనుగోలుపై తక్కువ రేట్లను భారీగా చిత్తూరులో వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీలపై మరిన్ని పరికరాలు అందించినట్లయితే అభివృద్ధి చెందేందుకు వీలుంటుందని కుమ్మరి కులస్తులు అంటున్నారు.

దేవుడు బొమ్మలకు భలే గిరాకీ..

గ్రామీణ ప్రాంతాల్లో మట్టితో చేసే దేవుడు బొమ్మలకు మంచి గిరాకీ ఉంది. పిల్లలు పుట్టిన వారు రెండు నుంచి ఐదేళ్లలోపు ఉన్న వారి పిల్లలకు మునీశ్వరస్వామికి గుండు గీయించుకోవడం ఆనవాయితీ. ఆసమయంలో మునీశ్వరస్వామి వద్ద మట్టితో చేసిన గుర్రపు బొమ్మలను దేవుడు వద్ద ఉంచడం ఆనవాయితీ. ఈ బొమ్మలకు మంచి గిరాకీ వస్తుంది. ఈ బొమ్మలను మండలంలోని వసంతాపురం, బండపల్లె గ్రామాల్లో ఆధికంగా చేసి విక్రయిస్తుంటారు. ఏది ఏమైనప్పటికి మట్టితో చేసిన వస్తువులు ఏదైనా ఆరోగ్యానికి మంచిదని పెద్దల సామెత.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి



జిల్లా స్టోర్‌లో అధికారులతో మాట్లాడుతున్న సీఈ చలపతి, ఎస్ఈ కృష్ణారెడ్డి

- ఉమ్మడి జిల్లా స్టోర్ సబ్‌డివిజన్‌కు ప్రతిపాదన పెట్టండి
- ట్రాన్స్‌కో సీఈ చలపతి

చిత్తూరు కార్పొరేషన్: వేసవిలో విద్యుత్ పరికరాలు కొరత లేకుండా అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో సీఈ చలపతి అన్నారు. మంగళవారం స్థానిక ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా స్టోర్స్‌ను ఆయన ఎస్ఈ కృష్ణారెడ్డితో కలిసి పరిశీలించారు. స్టోర్‌లో కనీస సదుపాయాలు అవసరమని డీఈ జయప్రకాష్ సీఈకి తెలిపారు. నిత్యం ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ పరికరాల పెద్దలారీ ఇక్కడికి వస్తుందన్నారు. వాటిని క్రేన్, జేసీబీ ద్వారా దించుకుంటున్నామన్నారు. పలు సంవత్సరాలుగా మట్టిరోడ్డు దిక్కుగా మారిందన్నారు. వాటి స్థానంలో రూ.80 లక్షలతో సీసీ రోడ్డును నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టామన్నారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లాకు ఒకే స్టోర్ ఉందని, వీటికి అనుబంధంగా సబ్‌డివిజన్ స్టోర్ ఏర్పాటు చేయాలన్నారు. అందుకు సంబంధించిన వివరాలతో ప్రతిపాదనలు పంపాలని సీఈ పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలని సీఈ ఆదేశించారు. అదేవిధంగా జగనన్న కాలనీలు, గృహాసర్వీసులకు విద్యుత్ అందించే ట్రాన్స్‌ఫార్మర్లు ఎప్పటికప్పుడు ఇస్తుండాలని తెలిపారు. కేబుల్స్, కండక్టర్స్ నిల్వ ఉంచుకోవాలన్నారు. పరికరాలను ముందస్తుగా వర్క్ ఆర్డర్స్ పెట్టుకుని తెప్పించుకోవాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో వర్క్ ఆర్డర్స్ పెట్టి నెలలు గడుస్తున్నా పనికావడం లేదన్నారు. పలువురు ఏఈలు వర్క్ ఆర్డర్స్ క్లోజ్ చేయకపోవడంతో వారికి జీతాలు కూడా రావడం లేదని చెప్పారు. స్టోర్‌లో నిల్వ ఉన్న ఉపయోగంలో లేని ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర విద్యుత్ పరికరాలను ఆన్‌లైన్‌లో వేలం నిర్వహించేందుకు ప్రతిపాదన పెట్టాలని సూచించారు. ఈఈలు రమణ, సుబ్బారావు, నరేంద్రనాథ్, మహేశ్వర్‌రెడ్డి, హరి, పిళ్లై, డీఈలు శేషాద్రి, ఏఈలు వివేకానందరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

- డ్వామా పీడీ గంగాభవాని

తవణంపల్లె: ఉపాధి పనుల లక్ష్యాన్ని అధిగమించేందుకు కూలీల సంఖ్య పెంచాలని డ్వామా పీడీ గంగాభవాని సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నలిశెట్టిపల్లె, దిగువ మోదలపల్లెలో జరుగుతున్న సప్లైచానల్ పూడికతీత పనులను పరిశీలించారు. ఉపాధి కూలీలతో పీడీ మాట్లాడారు. పనులు చేయడానికి గడ్డపారలు ఇప్పించాలని పీడీని కూలీలు అడిగారు. అధికారులకు ప్రతిపాదనలు పంపి వెంటనే అందజేస్తామని హామీ ఇచ్చారు. వేసవి దృష్టిలో ఉంచుకొని ఏప్రిల్ 1 నుంచి కూలీలకు రోజుకు రూ.272లకు పెంచిందని వివరించారు. మండలంలో ఇప్పటి నుంచి మూడు నెలల్లో కూలీలకు 82,500 పని దినాలు కల్పించి లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఏపీఓను ఆదేశించారు. అనంతరం టి.పుత్తూరు, తవణంపల్లె సచివాలయాలను తనిఖీ చేశారు. తవణంపల్లె ఏపీఓ లలిత, పీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.



దిగువ మోదలపల్లెలో కూలీలతో మాట్లాడుతున్న పీడీ గంగాభవాని

కమనీయం..కల్యాణం



కల్యాణోత్సవం చేస్తున్న అర్చకుడు

గుడిపాల: మండలంలోని కందగిరి కొండవద్ద వళ్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో మంగళవారం కల్యాణం కమనీయంగా సాగింది. ఉదయం ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మధ్య కల్యాణోత్సవం నిర్వహించి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం కుప్పిగానిపల్లె గ్రామంలో రథోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు అన్ని ఏర్పాట్లు చేశారు.

ప్రజాఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రకాశం

బంగారుపాళెం: గ్రామీణ ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రకాశం వైద్య సిబ్బందిని ఆదేశించారు. తుంబకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో వైద్యసేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెల్త్‌సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలతో సమీక్షించారు. విధి నిర్వహణలో ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వడదెబ్బ, డయేరియాపై ఏఎన్‌ఎంలు, ఆశాలు క్షేత్ర స్థాయిలో పర్యటించి అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం గ్రామ స్థాయిలో ఫ్యామిలీ ఫిజీషియన్ తీసుకొచ్చిందన్నారు. 104, 108, తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్, పీఎంవీవీవై, జేఎస్‌వై కార్యక్రమాలను వివరించారు. పీహెచ్‌సీ డాక్టర్ లోహిత్ చెంగల్రాయన్, సీహెచ్‌ఓ షమీమ్, ఎంపీహెచ్ఈఓ బృహస్పతి పాల్గొన్నారు.



ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా వైద్యాధికారి

వినాయకుని సేవలో జైళ్ల శాఖ డీఐజీ

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని గుంటూరు రేంజ్ జైళ్లశాఖ డీఐజీ వరప్రసాద్ మంగళవారం దర్శించుకున్నారు. సాయంత్రం ఆయన కుటుంబసమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.



డీఐజీ కుటుంబసభ్యులకు తీర్థ ప్రసాదాలు అందిస్తున్న సూపరింటెండెంట్ కోదండపాణి

అరగొండలో ఫ్యామిలీ ఫిజీషియన్



దిగువమాఘంలో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్



గుడిపాల: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పవన్

తవణంపల్లె: అరగొండ, దిగువమాఘం గ్రామాల్లో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించినట్లు తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. 104 మొబైల్ వాహనం ద్వారా రోగులకు డాక్టర్ వినయ్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు మందులు అందజేశారు. గర్భిణులకు వైద్య పరీక్షలు చేయించి మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ సుబ్రమణ్యంరెడ్డి, శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

197రామాపురంలో..

గుడిపాల: మండలంలోని 197రామాపురం, నంగమంగళం గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ పవన్ 180 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భిణులకు, బీపీ, మధుమేహ వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సూచనలను ఇచ్చారు.

నగరాభివృద్ధికి అందరూ సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ



పాల్గొన్న ప్రముఖులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు, కాలనీల అసోసియేషన్లు, ఇతర సంఘాలు సహకరించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డా. జె.అరుణ కోరారు. నగరాభివృద్ధిలో భాగంగా మంగళవారం సాయంత్రం నగర పాలక కార్యాలయంలో పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు, కాలనీల అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర అభివృద్ధి, మెరుగైన మౌలిక సదుపాయాలు, కాలనీల్లో సమస్యల పరిష్కారం, మెరుగైన సమాజ నిర్మాణానికి సంఘాలు, సభ్యుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. నగరంలో నెలకొన్న ప్రధాన సమస్యలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి అంశాలపై సభ్యులు నిర్మాణాత్మక సూచనలు, సలహాలు అందించారు. నగరాభివృద్ధి కోసం స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు కలిసికట్టుగా పూర్తి సహకారాన్ని అందిస్తామని తెలియజేశారు. ఇలాంటి సమన్వయ సమావేశాలు తరచూ నిర్వహించడం ద్వారా చాలా వరకు సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ నగర అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు, యూత్ సభ్యులు, కాలనీ సంఘాలతో కలిసి చర్చించాలనే ఉద్దేశంతో సమావేశం నిర్వహించామన్నారు.

నగరాభివృద్ధిలో సంఘాల పాత్ర ఎంతో ప్రధానమైనదన్నారు. రాబోయే సంవత్సరంలో నగరాభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు రూపొందించాలి, సంఘాల తరపున ఎలాంటి సహకారం కావాలి, కలిసికట్టుగా ఏం చేయగలం అనే విషయాలపైన చర్చించి నిర్ణయం తీసుకుందామని పిలుపునిచ్చారు. సహాయ కమిషనర్ గోవర్ధన్, సీఎంఎం గోపి పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు విజయవంతం చేయండి



పోస్టర్లను వలంటీర్లకు అందజేస్తున్న సుధాకర్‌రెడ్డి

పూతలపట్టు: ఈనెల 7వ తేదీ నుంచి జరిగే 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని మండల వలంటీర్లు, గృహసారథులు విజయవంతం చేయాలని మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పలు సచివాలయాలను సందర్శించిన ఆయన వలంటీర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. 7వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో వలంటీర్లు, గృహసారథులు కలిసి వారి పంచాయతీ పరిధిలోని లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడాలన్నారు. పార్టీ అందించిన పోస్టర్లను, కార్డులను అందజేయాలని సూచించారు. మంగళవారం మండలంలోని వేపనపల్లి, పోలవరం, వడ్డేపల్లి, బైటపల్లి, అప్పయ్యగారిపల్లి, బండపల్లి, తేనేపల్లి సచివాలయాలని సందర్శించారు. జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, దొరస్వామి రెడ్డి, ద్వారకనాథరెడ్డి, ఎంఎస్‌మణి, నిరంజన్‌రెడ్డి, షణ్ముగం, ప్రవీణ్, సుదర్శన్ పాల్గొన్నారు.

వన్యప్రాణుల మూగవేదన

గుడిపాల: వేసవిలో వన్యప్రాణుల మూగరోదన అంతఇంతా కాదు. ప్రస్తుత పరిస్థితుల్లో వాటి దాహం తీరడం లేదు. అటవీప్రాంతాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మేత, నీరు కరువవ్వడంతో బక్కచిక్కిపోతున్నాయి. గుడిపాల మండలంలోని గ్రామాల సమీపంలో అటవీప్రాంతాలు ఎక్కువగా ఉండడంతో వన్యప్రాణులు దాహం తీర్చుకునేందుకు జనావాసాల్లోకి వస్తున్నాయి. వీటిని గ్రామాల్లో కుక్కలు దాడిచేస్తుండడంతో మృతి చెందుతున్నాయి. ఎక్కువగా దుప్పులు, అడవిపందులు, జింకలు గ్రామాల్లోకి వస్తున్నాయి. ఈ ప్రాంతంలోని అడవుల్లో నీటి మడుగులు సరిగ్గా లేకపోవడంతో అడవి జంతువులు గ్రామాలవైపు దారి పడుతున్నాయి. ఇటీవల కట్టకిందపల్లె, చిత్తపార, బండపల్లె జింకలు తాగునీటి కోసం వచ్చి కుక్కలబారిన పడి మృత్యువాత పడిన ఘటనలు కూడా ఉన్నాయి. ముత్తువాళ్లూరు గ్రామంలోకి ఓ జింక తాగునీటి కోసం ఇంట్లోకి వచ్చింది. ఇంటి ఆవరణలో ఉన్న నీటితొట్టెలో నీటిని తాగింది. ఇంతలో కుక్కలు దాన్ని వెంబడించాయి. గ్రామస్తులు చూసి కుక్కలను చెదరగొట్టడంతో జింక అటవీప్రాంతంలోకి వెళ్లింది. అటవీశాఖ అధికారులు స్పందించి అటవీప్రాంతాల్లో నీటితొట్టెలు నిర్మించి ట్యాంకర్ల ద్వారా నీరు ఏర్పాటుచేసి వన్యప్రాణులను కాపాడాలని పలువురు జంతుప్రేమికులు కోరుతున్నారు.



ముత్తువాళ్లూరులో తాగునీటి కోసం వచ్చిన జింక (ఫైల్)

భక్తిశ్రద్ధలతో పంగుణి బ్రహ్మోత్సవాలు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం ఈశ్వరగుడివీధిలోని శ్రీ అగస్తీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పంగుణి బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అభిషేక, పూజలు అనంతరం వేదపండితులు నటరాజస్వామి ఉత్సవాన్ని జరిపించారు. రాత్రి కైలాసగిరి రావణ వాహనంలో స్వామిని ఊరేగించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ చైర్మన్ శివప్రసాద్, అర్చకులు శివకుమార్, ఈఓ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

క్రీడా బహుమతుల అందజేత



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎస్ఐ

పూతలపట్టు: మండలంలోని జెడ్పీ హైస్కూల్‌లో వార్షిక క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం ఎస్ఐ హరిప్రసాద్ బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోను రాణించాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిస కాకుండా చదువు పై దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులు తేజశ్రీ, విష్ణు, హేమంత్, మేఘన, ఇతియాజ్, శ్రావణ్, సాగర్‌లను ప్రత్యేకంగా అభినందించారు. హెచ్‌ఎం దామోదరనాయుడు, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

గుడిపాలలో జోరుగా కర్ణాటక మద్యం

గుడిపాల: గుడిపాల మండలంలో కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. ఎక్సైజ్‌శాఖ చూసిచూడనట్టు వ్యవహరిస్తోంది. ఎక్సైజ్ సిబ్బంది మామూళ్లకు అలవాటు పడి వదిలేస్తున్నారని గ్రామాల్లో చర్చించుకుంటున్నారు. దీనివల్ల ప్రభుత్వ మద్యం దుకాణాలకు ఆదాయం తగ్గుతోంది. పిల్లారికుప్పం, గుడిపాల, వెప్పాలమానుచేను, చిత్తపార, కమ్మతిమ్మాపల్లె ,197రామాపురం, బొమ్మసముద్రం ప్రాంతాల్లో బెంగళూరు మద్యం జోరుగా సాగుతోంది. ఇప్పటికైనా అరికట్టేందుకు ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.